క్లుప్తంగా

మలేరియా నియంత్రణకు చర్యలు


మండల కేంద్రంలోని దోమల నివారణ మందు పిచికారీ పనులు చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: మన్యంలోని కురుస్తున్న వర్షాలు కారణంగా మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో పంచాయతీ అధికారులు అప్రమత్తమైయ్యారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలోని సోమవారం ఫాగింగ్ యంత్రం ద్వారా దోమల మందు పిచికారీ పనులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, ఆరోగ్యసూత్రలను పాటించాలని అవగాహన కల్పించారు. గ్రీన్ అంబాసీడర్ మామిడి రవి, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


శిక్షణ పూర్తయిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ తిమోతి


హుకుంపేట: స్వయం కృషితో గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆఫ్ హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఏ.ఫిలిప్ తిమోతి అన్నారు. మండలంలోని పాటిమామిడిలో సంస్థ నిర్వహించిన కుట్టు శిక్షణ చేసుకున్న 22 మంది మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. గిరిజన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలు అందరు కలిసి డైరెక్టర్‌ను సన్మానించారు. సంస్థ కో–ఆర్డినేటర్ కొర్ర గురుమూర్తి, విజయ్, మాలన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై ప్రచారం


బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

అనంతగిరి: టీబీ రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుంది. సోమవారం మండల కేంద్రంలోని వారపు సంతలోని బీసీజీ వ్యాక్సినేషన్‌పై వైద్యాధికారి జ్ఞానేశ్వరీ ఆధ్వర్యంలోని ఎంపీహెచ్‌ఈవో నర్సింగరావు గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని 70 మందికి బీజీసీ వ్యాక్సినేషన్ వేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకోవాలని, టీబీ నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఏఎన్ఎం గౌరీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


60 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు రవిచంద్రశేఖర్, మణికంఠ

జి.మాడుగుల: ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తితే అశ్రద్ధ చేయకుండా పీహెచ్‌సీలను సంప్రదించి నయం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, డాక్టర్ నాగమణికంఠ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన అవసరమన్నారు. శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘సిరి’ధాన్యాలు

- చిరుధాన్యాలతో ఆరోగ్యంతో పాటు ఆదాయం
- మార్కెట్‌లో డిమాండ్
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు


ఎండబెట్టిన రాగులు


సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది


మన్యంలో చోడి పంట

మండలంలో సాగు వివరాలివీ..

- 1800 ఎకరాల్లో ఈ చోడి(రాగి) పంటను రైతులు పండిస్తున్నారు.
- 250 ఎకరాల్లో సామ చేస్తున్నారు.
- మండలంలోని పెదబరడ, కొమ్మంగి, గొందిపాకలు, అన్నవరం, లోతుగెడ్డ, చాడుపల్లి, బెన్నవరం, ఎర్రబొమ్మలు గ్రామాల్లో అధికంగా పండిస్తున్నారు.

చింతపల్లిరూరల్: ఆహారపు అలవాట్లలో మార్పులు రావడంతో ప్రజలు తక్కువ వయస్సులోనే వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. ఎటువంటి పోషకాలు లేని ఆహారాన్ని నేడు మనం తింటున్నామనేది అందరికీ తెలిసిన విషయమే. మన పూర్వీకుల విషయానికొస్తే అందుబాటులో ఉండే పౌష్టికాహారాన్ని తిని ఎంతో ఆరోగ్యంగా జీవించేవారు. వరి వంటి నీటి ఆధారిత పంటలు పండకపోయిన ఆరుతడి పంటలైన చోడి, కొర్ర, సామ, వరిగ, అరికలు వంటి పంటలు సాగు చేసి ఆహార కొరత లేకుండా చేసుకునేవారు. ఇటువంటి చిరుధాన్యాలు తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.. అయితే మారుతున్న కాలగమనంలో మళ్లీ చిరుధాన్యాలకు డిమాండ్ బాగా పెరిగింది. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వైద్యులు, నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా వీటి వినియోగం గతంలో కంటే ఎక్కువగా పెరుగుతోంది. వీటికి డిమాండ్ ఉండడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుకి ఆసక్తి కనబరుస్తున్నారు.

పెరుగుతున్న చిరుధాన్యాల వినియోగం

కొంతమంది చిరుధాన్యాలను నేరుగా తింటుండగా, మరి కొంత మంది పొడర్‌లా చెసుకోని అంబలి రూపంలో తాగుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే నేటి తరం వారు కూడా మరలా పూర్వీకులు తీసుకునే ఆహారం వైపు మొగ్గ చూపిస్తున్నారు. ఆయా ఆహారాన్ని తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండడం, ,వైద్యులు సైతం చిరుధాన్యాలను ఆహరంగా తీసుకోమని సూచించడం వలన చాలా మంది చిరుధాన్యలు తినడానికి మొగ్గ చూపిస్తున్నారు. చిరుధాన్యాలు తక్కువ నీటితో పండించవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు,నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మన్యంలో చోడులు, సామలు అధికంగా పండిస్తున్నారు.మిగిలినవి అంత అంతమాత్రనే పండిస్తున్నారు. ఈ చిరుధాన్యాలకు పండించేందుకు తక్కువ నీరు అవసరం. అయితే అధిక దిగుబడులు రావడంతో రైతులు పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

చోడి పంట: ఈ పంట ఖరీఫ్ అయితే జూలై, అగష్టు నెలల్లో విత్తుకుంటే డిసెంబర్, జనవరి నాటికి పంట చేతికివస్తుంది.

చోడి పంటలో రకాలు: చోడి పంటలో ఇంద్రవతి, మండువా–376, వేఘవతి, వీఆర్–376 రకాలు అందుబాటులో ఉన్నాయి.వీటిలో వీఆర్–376 రకం గిరిజన ప్రాంతాల్లో అధికంగా విత్తుకుంటున్నారు. దిగుబడి కుడా బాగుంటుంది.

సామలు: ఈ పంటకు తేలికపాటి ఎర్రటి ఇసుక నేలలు అనుకూలం. ఈ పంటను జూన్, జూలై నెలల్లో విత్తుకోవాలి:

డిసెంబర్, జనవరిలోనే పంట చేతికి వస్తుంది. సామల్లో విత్తన రకాలు: కో–2, బీఎల్ఎం–203 రకాలున్నాయి. ఈ రకాలు 80 నుంచి 85 రోజుల్లో పండుతుంది. బీఎల్ఎం–36, బీఎల్ఎం –26 రకాలు 90 నుంచి 100 రోజుల్లో పండుతుంది. గిరిజన గ్రామాల్లో లోకల్ సిడ్‌ను రైతులు పండిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుతం ఏజెన్సీలో చిరుధాన్యాల సాగు పెరుగుతోంది. మార్కెట్‌లో ఏజెన్సీ చిరుధాన్యాలకు గిరాకీ ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు. వీటిని తక్కువ నీటితో పండించవచ్చు. అధిక దిగుబడులు పొందవచ్చు. చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి

దిగుబడి బాగుంది



రాగులు, సామలు పండించడానికి తక్కువ నీరు అవసరముండడంతో పంట వేసేందుకు మొగ్గ చూపిస్తున్నాం. రోజురోజుకి చిరుధాన్యాల అవసరాలు పేరుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తాం. మంచి ఆధాయం వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది రాగి కిలో ధర 38.46లకు ప్రభుత్వం కోనుగోలు చేసింది.

– కోర్ర లక్ష్మి,
చెరుకుంపాకల గ్రామం, లోతుగెడ్డ పంచాయతీ

అరకు ఎమ్మెల్యేకు ఘన సన్మానం


అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

హుకుంపేట: మండలంలోని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. గ్రామాల పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలో వర్తక సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారాలు నిర్వహించాలని ఆయన కోరారు. వర్తక సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. నాయకులు రవిప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

గూడెంకొత్తవీధి/ వై.రామవరం: మన్యంలో గంజాయి సాగు, అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి, వై.రామవరం ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని చేరవేసేందుకు అల్లూరి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా 93811 23100 టోల్‌ఫ్రీ నంబరును కేటాయించినట్టు పేర్కొన్నారు.. ఎవరైనా ఈ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వచ్చన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 50 సీట్లు ఖాళీ ఉన్నాయని, దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎం ప్రమీలారాణి తెలిపారు. ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలోను పది చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఈ పాఠశాలలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ బాలికలు మాత్రమే అర్హులన్నారు. పాఠశాలలో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకొని ప్రవేశం పొందవచ్చని కోరారు. పాఠశాలలో అన్ని విధాలా మౌలిక వసతులు ఉన్నాయని, అన్ని సబ్జెక్టులలో నిపుణులైన ఉపాధ్యాయులతో మెరుగైన బోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గిరిజన సంక్షేమ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.


అమీనాబాద్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ

పిల్లలను బడిలో చేర్పించాలి


పెదబయలు కూడలిలో నేను బడికి పోతా కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

పెదబయలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పెదబయలు మండలం కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంఈవో కృష్ణమూర్తి అన్నారు. పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ప్లకార్డులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మూడు రోడ్ల కూడలి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి గ్రామాల్లో బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలన్నారు. సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యా కమిటీ వారి సహకారం తీసుకుని తిరిగి బడికి చేర్పించాలన్నారు. ప్రతీ రోజు గ్రామాల్లో పర్యటించి రోజు వారిగా ప్రవేశాలు కల్పించాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసినట్టు ఎంఈవో తెలిపారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.


కించాయిపుట్టు పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ముంచంగిపుట్టు: విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులంతా సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో ఉన్న మండల పరిషత్ పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి వర్క్ బుక్స్‌ను పరిశీలించి, తప్పులను సరిదిద్దారు. లెక్కల పాఠాన్ని బోధించారు. పలుప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అందిస్తున్న పీఎం పోషణను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆన్‌లైన్ పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, చదువులో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, బడి బయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏపీజీవీబీ మేనేజర్, క్యాషియర్‌కు బదిలీ

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) మేనేజర్ నందకుమారన్, క్యాషియర్ దుర్గారావు అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పెదగుమ్మలూరు బ్యాంకుకు బదిలీ అయ్యారు. బ్యాంక్‌లో 2022, ఆగస్టు10న మేనేజర్‌గా ఎస్.నందకుమారన్ బాధ్యతలు చేపట్టారు. 2023, ఏప్రిల్ 18న ఎస్.దుర్గారావు క్యాషియర్‌గా విధుల్లో చేరారు. ఇద్దరినీ బదిలీ చేస్తూ బ్యాంక్ ఉన్నతాధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి


వీఆర్‌వోలు, వీఎస్‌లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: ఎన్‌హెచ్– 516ఈ రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా భూమి, ఇళ్ల కోల్పోయి నష్ట పరిహారం అందని గిరిజనులు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. ఈ సమస్యలకు సంబంధించి సోమవారం వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబరడ పంచాయతీ పరిధిలో గల గ్రామాల ప్రజలకు నష్టపరిహార సమస్యలు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ విషయంపై రెవెన్యూ సిబ్బంది చోరవ తీసుకోవాలని సూచించారు. ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సూచనలిస్తున్న ఈవోపీఆర్డీ పాపారావు

గూడెంకొత్తవీధి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చింతపల్లి ఈవోపీఆర్డీ పాపారావు అన్నారు. ఎంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలన్నారు. పైపులైన్ల లీకేజీలు ఉన్న వాటిని గుర్తించి వాటిని సరిచేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు పంపిణీ చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ స్టాచి తదితరులు

పెదబయలు:పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యతని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ స్టాచి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో సేవ్ ప్లానెట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సేవ్ ప్లానెట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించి కూడలిలో మానహారం ఏర్పడ్డారు. సేవ్ ప్లానెట్ అంటూ నినాదాలు చేశారు.పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని, అడవులకు సంరక్షించుకోవాలన్నారు. అకడమిక్ హెడ్ కేశవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపు అవసరం


శిక్షణకు హాజరైన వారితో ఆచార్య రామ్మోహనరావు

ఏయూ క్యాంపస్: విద్యా రంగంలో నాణ్యత ప్రమాణాలను నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మదన్‌మోహన్ మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహిస్తున్న నర్చరింగ్ ఫ్యూచర్ లీడర్‌షిప్ రెండో దశ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిర్దిష్టమైన నైపుణ్యాలను అధ్యాపక సిబ్బందిలో పెంపొందించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ఎన్ఈపీ 2020లో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను రూపకల్పన చేశామన్నారు. కేంద్రీయ సంస్థలకు చెందిన మొత్తం 34 మంది సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సంచాలకుడు ఆచార్య అమిత్ బరాన్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల్లో మరింత మార్పు అవసరం


హెచ్‌ఎంలకు పలు సూచనలిస్తున్న ఎంపీడీవో నగేష్, పక్కనే ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి ఉన్నత విద్యా ప్రమాణాలతో మరింత మార్పుతో ఉపాధ్యాయులు ముందుకు సాగాలని, ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సోమవారం 12 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 1 కేజీబీవీ పాఠశాల హెచ్‌ఎంలతో, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యాప్రమాణాలు తక్కువగా ఉన్నాయని, ఉన్నత చదువుల్లో విద్యార్థులు సామర్థ్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు నెలల పాటుగా ప్రత్యేక ప్రణాళికలతో ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగునకు కృషి చేయాలని కోరారు. అనంతగిరి మండలానికి మంచిపేరు తెచ్చే విధంగా బోధనతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడినప్పుడు తప్పనిసరిగా మనలను గుర్తు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎంపీడీవో నగేష్, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ, ఏవో లక్ష్మీనారాయణ, హెచ్‌ఎంలు మంగమ్మ, మల్లీశ్వరీ, విమలకుమారి, సీమోను తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి


జర్రెలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాలను ఆమె సోమవారం సందర్శించారు. తన సొంత డబ్బుతో 36 మంది విద్యార్థులకు బుక్స్, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాల్లో సౌకర్యాలు వినియోగించుకుంటూ చదువును కొనసాగించాలన్నారు. పాఠశాల చైర్మన్ గాసిరావు, ఉపాధ్యాయులు తిరుపతిరావు, బోద్రాజు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు రామకృష్ణ, రాజేంద్ర, మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో భారీ వర్షం


చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లిరూరల్: మండలంలో చింతపల్లితో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.